# కాటేయని కరినాగు

"కందుకూరి"



**మధుమూర్తి :**

ఇవాళ హనీమూన్ మొదటి రోజు. ఈ నాగార్జున సాగర్లో. కాటేజీలో ఈ చలిలో ఇలా అఘోరిస్తున్నాం.

గుండె అంతా దిగులుగా వుంది.

పెంచుకున్న కోరికల చెట్టు ఒక్కసారిగా కూలినట్లుగావుంది.

నేనూహించని అన్యాయం జరిగిపోయింది. ఇంతకాలం ఎన్నో పెళ్ళిచూపుల్లో వెతికాను. అంతదాకా దేనికి ; కొలీగ్ ఇందుమతిని కాదనటానికి కారణం ఏమిటి? ఇంకా ఎంతోమందిని కాదన్నందుకూ, ఆ కారణం వాళ్ళకి చెప్పకుండా ఏదోకటిచెప్పి తప్పించుకున్నందుకూ వాళ్ళ ఉసురు ఇలా తగిలిందా? అసలీ ఉసురు అంటే ఏమిటి? సహేతుకమైనదేనా?

విశాలాక్షక్కయ్య అనేది.

మాధవరావు మామయ్య కూతురిని కాదన్నప్పుడు తిట్టి మరీ చెప్పింది. "ఎడ్యుకేషనంటారు. ఫెయిరెన్నెసంటారు. కానీ యిదేమిట్రా యిలా ఇంతమందిని ఉసూరుమనిపిస్తున్నావు యిదేం బాలేదు" అని.

అక్కయ్యకేం తెలుసు?

"కరి నాగంటి జడ చూడు.

అది కాటేస్తేనే మగవాడు" అని ఘంటసాల నా గుండెలో నాలుగేళ్ళుగా చేస్తున్న గోల.

అసలా మాటకొస్తే చాలా మందికి తెలీదు. మొత్తం శరీరానికి జడవల్ల ఎంత అందం వస్తుందో! ఏ అడ్డూ లేకుండా వుండే విందుపాటి నల్లటి వెంట్రుకలన్నీ. వాటిని భరించే నునుపైన వీపునీ చూడటంలో ఎంత ఆనందం వుంది? కొండపై నుంచి జలపాతం దూకుతున్నట్లుండదూ!

జుట్టంతా ముందుకు తీసుకునొచ్చి. మధ్యలోంచి అలలు అలలుగా కదిలినట్లని పించే ముఖాన్ని చూడటంలో ఒక మధురిమా లేదూ! ఆషాఢ మేఘం దాటిన పూర్ణ చంద్రోదయం కాదూ!

నాగుపాములాంటి నల్లటి జడ నితంబ సీమపై కుడిఎడమలుగా నర్తిస్తుంటే గుండె పొందే సంబరం సంగతేమిటి?

కన్యాకుమారిలో సన్రైజ్ చూసినట్లూ. సాగర్ డామ్మీద సన్సెట్ చూస్తున్నట్లూ. శేషేంద్ర కవిత చదూతున్నట్లు అనిపించదూ!

ఏమైతేనేం !

అర్హతలెన్నో వున్నా కేవలం అందమైన పొడుగైన స్వంత జడలేదని తిరస్కరించిన అయిదుగురు పైగా అమ్మాయిల తర్వాత దొరికిందనుకున్న ఆనందమూ. తెలుగు లెక్చరర్ సుబ్రహ్మణ్యం అందించిన జడ తాలూకు సాహిత్యమంతా సార్థకమైందని పొందిన సంతోషమూ.... సర్వం లేకుండా పోయాయి. జడ!.... నల్లటి పొడవాటి. ఒత్తైన జడ!.... నేను కలలుకన్న జడ! తన వయ్యారపు నడకలో లోలకంలా కదుల్తూ. నా బ్రతుకు గడియారాన్ని నడుపుతుందనుకున్న జడ.... ఏదీ.... దొరికీ దొరికిందనుకుంటున్నప్పుడే చెయి జారిపోయింది.

ఏమో! అందరూ నాలాగే ఆలోచిస్తారనేముందీ? మనుషుల్లో చాలామందికి సౌందర్యారాధన వుండటంలేదు. పెళ్ళిళ్ళన్నీ లస్ట్ కోసమే జరుగుతున్నట్లనిపిస్తున్నాయి. శారీరక సౌఖ్యం దాటిన చాలా చాలా వాటిల్ని క్షమించేస్తున్నారు జనం.

అలా క్షమించలేక.... ఎందరో్ని కాదని వద్దన్నందుకు ఏమిటి ఫలం? సునందని ఏరి కోరి చేసుకున్నందుకు ఏది సంతోషం?

మెదడు మొద్దుబారిపోతోంది. ఏం

తోచటంలేదు. పైలాన్ వైపునుంచి యింకా బస్సులగోల వినిపిస్తూనేవుంది. మొగలి పూల జడలాగా వెన్నెల్లో తెల్లగా వుంది రోడ్డు. విరజాజుల జళ్లోంచి పరిమళం ఎగిరి వచ్చినట్లుగా అప్పుడప్పుడు చల్ల గాలి ప్రేమగా పలకరిస్తోంది.

సునందకు పొడవైన జుట్టుంది. కానీ ఏం లాభం? మోసం జరిగిపోయింది. మళ్ళీ మళ్ళీ దిద్దుకోలేని మోసం.

తను ఆమె ఒళ్ళో తలవాల్చి జడతో ఆడుకుంటూ "కలకలలాడు యీ వాలు జడకై జగమెంత తపం బొనర్చెనో చెలియా నన్నేలు రమణీ. ధరింపుమిక నొక్కుల పాయలలో గులాబిగాన్". అంటూ రామచంద్ర అప్పారావుగారి కవిత ఆలపించి ఆనందిద్దామని ..యింకా. .ప్చ్.. నేననుకున్న ఆలోచనల అలలన్నీ విరిగి పోయాయి అక్కయ్య వరకూ. అమ్మ వరకూ వచ్చిన నిజం అక్కడే ఆగి పోయింది! వాళ్ళెందుకు చెప్పలేదూ తనకి? ఇదేమంత ముఖ్యమైన విషయం కాదను కున్నారా? చాలా కాలానికి కుదిరిన పెళ్ళి పొడవుతుందనుకున్నారా? ఏమో!

తలుపులు తీసి వున్నాయి.

బోర్లా పడుకునుంది సునంద. మంచి నిద్రలో వున్నట్లుంది. తెల్లటి చీరమీద వీపుమీద పడుకున్నట్లుగా కనిపిస్తోంది నలి గిన నల్లటి పొడవైన కరినాగులాంటి జడ! రేపిలాటి జడను తను వేసుకోలేదు కదా! మరేం చేస్తుంది!

తెలివైన అమ్మాయే! వ్యూపాయింట్ లోంచి డామ్ చూసిం తర్వాత వస్తూండగా వెస్ట్‌కెనాల్ పొడవడిగితే కరెక్టుగా చెప్పే సింది. కానీ జడ మాత్రం! నలిగి పోయిందిగదా. మళ్ళీ వేసుకోమంటే ఎంతో భయంగా తప్పు చేసినట్లుగా చెప్పింది. జడేసుకోవటం తనవల్ల కాదట! చిన్నపుడే పోలియోవచ్చి కుడి చేయి బాగా పైకి లేవదుట. ఇంకే పని చేసుకోవటానికీ యిబ్బంది కాదుట. అయినా. బాగా జడేసు కోవటం చేతకాకపోయినాక. యింకే పని సాధ్యపడితే మాత్రం ఏవుందీ?

ఏమిటో! మనసంతా శూన్యంగా వుంది.

పొడవైన కురులున్నాయి. కానీ అవి జడగా మారవు. వీణ వుంది. పొడవైన తీగలున్నాయి. సవరించి ఆలపించేవారే లేరు!

సునంద :

మధ్యాహ్నం ఎండలో పడి యీ సాగ రొచ్చాం. హనీమూన్‌ట! ఆ మాటనగానే ఏవేవో పాత జోకులు గుర్తుకొస్తున్నాయి. వస్తుంటే స్వప్న తెగ వెక్కిరించింది.

"హడావుడిగా పెళ్ళాడావు. అర్జెంటుగా హనీమూన్ కెడుతున్నావ్. మీ ఆయన్ని చూస్తే మాంచి ప్రోగ్రెసివ్‌లా కన్పిస్తు న్నాడు. క్విక్ రిజల్ట్స్ వస్తాయేమో!"

స్వప్న మరీ మగ జోకుల వేసేస్తోంది మధ్య.

ఏదో కొత్త లోకంలో తిరుగుతున్నట్లుగా వుంది. చేతిలో చెయ్యేసుకుని సైదోడుగానడు స్తుంటే. ఏదో ధైర్యంగా కూడా వుంది. ఇంకా బాగా చనువు ఏర్పడకపోయినా కొత్తదనం మాత్రం పోయింది. అయినా పెళ్ళయి ఎన్ని రోజులయిందని! ఈ పెళ్ళి కాకుండా వుంటే యింకా నాలుగు ఛేజ్ నవ ల్లయినా చదివుండేది. హాయిగా ఎమ్మె స్సీలో న్యూక్లియర్ ఫిజిక్సుకో. మరో దానికో అప్లయిచేసి వుండేదీపాటికి. మంచి సంబంధమనీ. మంచి ఉద్యోగమనీ నాన్న మొహమాటపెట్టేశారు. ఆ నావలెక్కడికి పోతాయన్చెప్పి. అసలు విచిత్రంగా యిప్పుడుతనకేం చదవాలనే అనిపించడం లేదు.

లెక్చరరనే రిజర్వ్‌డ్‌నెస్ బొత్తిగా లేదు. ఎక్కువగా జడ చేతిలోకి తీసుకుం టారు. జడంటే బాగా యిష్టంలా వుంది. 'డాం' మీద నడుస్తున్నప్పుడు. కూర్చుంటు న్నప్పుడూ చిలిపి పనులకు మాత్రం తక్కువేం లేదు. ఫర్వాలేదు. నో ప్రాబ్లెం! ఏదో కవిత్వం వ్రాస్తాల్లా వుంది!

"ఆకాశం పడుకుంటోంది చూశావా" అన్నారు సాయంత్రం.

కాఫీ. టీలు తాగరుట. ఇది మైనస్ మార్కు. అలా అయితే నా సంగతేమిటి? అర్జెంటుగా. ఆయనకూడా అలవాటు చేయాలి.

ఇంటి దగ్గర బయల్దేరిందగ్గర్నుంచి ఆనందంగా వున్నట్లుండి భోంచేయగానే హఠాత్తుగా ఏదో పోగొట్టుకున్నట్లు ఈయన బయట కెందు కెళ్ళినట్లు?

తనేమందని? వున్న విషయమే చెప్పింది. జడేసుకోలేనని అంది. వాళ్ళం దరికీ తెలిసిన విషయమే కదా! ఇప్పుడే తెలుసుకుంటున్నట్లు కోపంగా రెట్టించటం దేనికి ఆ విషయంలో.

బయట చలి ఎక్కువగానే వుండి వుండాలి! మరెందుకలా కూర్చున్నట్లు? కూర్చున్న భంగిమ బావుంది! కాళ్ళు మడిచిపెట్టుకుని. దిగులుగా దిగంతాల కేసి చూడ్డం.

"మీ ఆయనకు సినిమా టిక్కెట్లు తెలుసేవ్" అంది స్వప్న.

జడ ముందుకేసుకో బాగుంటుందని సలహా! ఆయనకో.... నాకో? ఇంకా ఏమి టబ్బా.... ఏదో అన్నారు? ఆ! అలా ముందుకేసుకుంటే.... "రెండు ఇసుక తిన్నెల మధ్యగా ప్రవహిస్తున్న కృష్ణలా వుంటుందట" ఇవ్వాల్టికే నలిగిపోయిందీ జడ! రేపెలాగా ఏమో? అబ్బా నిద్రొస్తోంది బాబూ.... ఇంట్లో అమ్మో. వదినో ఎవరో ఒకరు జడేసేవారు.... ఇక ముందెలాగో? ఇకముందు....

* * *

చాలా పొద్దెక్కిపోయింది లేచేసరికి. గబ గబా పనులు ముగించుకుని స్నానం కానిచ్చి చీర కట్టుకున్నాను. కుచ్చిళ్ళు సర్దుకుని పాదాల దగ్గర మడత పడినట్లుంటే సరి చేద్దామని ముందుకు వంగాను. వెనక ఎవరో పట్టుకున్నట్లయింది. తిరిగి చూశాను. ఇది మరీ ఆశ్చర్యం! ఆయన! ఓ చేతిలో నా జడ. మరో చేతిలో దువ్వెన! ఆ పెదవుల మీద కొంటె నవ్వు

"ఏ గగనమో కురులజారి నీలిమై పోయె" ఎక్కణ్ణుంచో సన్నగా వినిపిస్తోంది!

(కరినాగును ముస్తాబు చేసిన కవితకే ఈ కథానిక)

